జోరు వర్షం.. రైతుల హర్షం

- కొనసాగుతున్న వర్షాలు
- కొలిమిగుండ్లలో 29.8 మి.మీ వర్షపాతం నమోదు
- జీవం పోసుకుంటున్న పైర్లు

కోవెలకుంట్ల/కొలిమిగుండ్ల /సంజామల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజుల నుంచి వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 29.8 మి.మీ, అవుకు మండలంలో 16.4 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 6 మి.మీ, దొర్నిపాడు మండలంలో 3.8 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 1.8 మి.మీ, సంజామల మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మిరప, కంది, పెసర, మినుము, మొక్కజొన్న, బెండ తదితర పంటలకు వర్షం ఊపిరి పోయగా.. ప్రస్తుతం సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

నిడుకుండలా ముత్యాలవాగు చెరువు

సంజామల మండల పరిధిలోని ముక్కమల్ల సమీంలో ఉన్న ముత్యాలవాగు చెరువు నిండుకుండలా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయింది. ముక్కమల్ల, అల్వకొండ, ముచ్చలపూరి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 500 ఎకరాల భూములు సాగు ఈ చెరువుపై ఆధారపడింది. వర్షంతో చెరువు నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జొలదరాశి సమీపంలో మినుము పంటలో చేరిన వర్షపునీరు

→ కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు, తిమ్మనాయినపేట, నాగిరెడ్డిపల్లె, బిఉప్పలూరు, బితాడిపత్రి, హనుమంతు గుండం, యర్రగుడి గ్రామాల్లో సోమవారం తెల్లవారు జామున కుండపోత వర్షం కురిసింది. దీంతో పంట పొలాలు ఎక్కడా చూసినా వర్షపునీటితో నిండిపోయాయి. హనుమంతుగుండం చెరువులోకి నీరు చేరడంతో జళకళ సంతరించుకుంది. ఖరీఫ్‌లో కంది, ఆముదం, పొద్దుతిరుగుడు, మిరప తదితర పంటలు సాగయ్యాయి. కొద్ది రోజుల నుంచి చినుకు జాడ లేక పైర్లు వాడుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో నిల్వ ఉన్న వర్షపునీరు

పైర్లకు జీవం

బనగానపల్లె: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైర్లు జీవం పోసుకున్నాయి. నియోజకవర్గంలో వ్యసాయాధికారుల లెక్కల ప్రకారం సుమారు 18 వేల ఎకరాల్లో మిరప, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగయ్యాయి. కొంతకాలంగా వర్షం ముఖం చాటేయడంతో పైర్లు వాడుబట్టాయి. ఈక్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వానలకు మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. పైర్లను చూసి రైతులు కాస్త ఊరట చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది.



కాపులపల్లె సమీపంలో జీవం పోసుకున్న మిరప పైరు

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

డోన్ టౌన్: ప్రజల్లో మూఢ నమ్మకాలు పారద్రోలి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పరిశీలకులు ఖాజా హుస్సేన్ సూచించారు. పట్టణంలో జరుగుతున్న సంఘం మహాసభలకు రెండో రోజు సోమవారం ఆయన హాజరై మాట్లాడారు. ఆధునిక సమాజంలో పెరుగుతున్న సాంకేతికతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు మూఢ నమ్మకాలకు అధికంగా నష్ట పోతున్నారని వీరిని జాగృతం చేయాలన్నారు.

నూతన కమిటీ..

జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జనార్దన్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రామరాజు, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ లతీఫ్, గురుస్వామి, ప్రధాన కార్యదర్శిగా డోన్ మాణిక్యం శెట్టి, కోశాధికారిగా పునీత్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా సర్వజ్ఞమూర్తి, శ్రీనివాసబాబు, రామమూర్తి, గోపాల్, సమత, కన్వీనర్‌గా లక్ష్మీదేవి, యూత్ కమిటీ సభ్యుడిగా చిన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె, ఆర్ బుక్కాపురం గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు మునేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణాష్టమి వేడుకలకు జెడ్పీ చైర్మన్‌కు ఆహ్వానం



వేడుకల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాత, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మీర్జాపురంలో జరగనున్న కృష్ణాష్టమి వేడుకలకు హాజరు కావాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ఆహ్వానం అందింది. సోమవారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో జెడ్పీ చైర్మన్‌ను త్రైత సిద్ధాంత సభ్యులు పోరెడ్డి రామకృష్ణారెడ్డి, మహేష్, రాజా, రామకృష్ణ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతర ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ముచ్చట్లలో ప్రత్యేక పూజలు



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన భ్రమరాంబాస మేత మల్లికార్జునస్వామికి శ్రావణ సోమవారం సందర్భంగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. ఆర్ఎస్ రంగాపురం రైతు సంఘం ఆధ్వర్యంలో 108 బిందెలతో శివునికి జలాభిషేకం చేశారు. బుగ్గాని పల్లె గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో వేలి ముద్రలు తీసుకుంటున్న వలంటీర్

బేతంచెర్ల: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. అనారోగ్యంతో బాధ పడుతూ కర్నూలులో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన గజ్జి దేవదానంకు వలంటీర్ రమాదేవి అక్కడికే వెళ్లి పింఛన్ అందజేసింది.

విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ



విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న బుచ్చిరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని మీరాపురం గ్రామం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సోమవారం యాగంటి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి తన సతీమణి దివంగత తోట కుమారి జ్ఞాప కార్థం స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటాద్రి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండె పోటుతో లారీ క్లీనర్ మృతి



బాలమద్దిలేటి(ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన లారీ క్లీనర్ హరిజన బాలమద్దిలేటి(30) గుండె పోటుతో మృతిచెందాడు. విధుల్లో భాగంగా కేరళ రాష్ట్రంలోని క్యాలీకట్‌కు వెళ్లిన బాలమద్దిలేటి శనివారం అక్కడే గుండెపోటుకు గురయ్యాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం ధర్మవరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న సాయిశ్రీ విద్యాసంస్థలు, సిదార్థ, శ్రీసుధ, వెంకటేశ్వర తదితర ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్, నాయకులు సిద్ధార్థ, శశిధర్‌రెడ్డి, ధనుష్, సురేష్, కిరణ్, కార్తిక్, రాఘవ డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ విద్యాసాగర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అధిక ఫీజుతో పాటు యూనిఫాం, బుక్స్ పేరుతో వేలకు వేలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అంకిరెడ్డిపల్లె ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. గ్రామ సచివాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భార్గవీలత ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 11వ వార్డు సభ్యుడు దూదేకుల పెద్ద దస్తగిరిని మిగిలిన వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియ ముగియడంతో ఎన్నికల అధికారిణి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన పెద్ద దస్తగిరిని సర్పంచ్ నాగన్న, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవీలత

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బేతంచెర్ల: నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ, నిత్యావసర ధరల నియంత్రణలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, పార్టీ నాయకులు బాషా, రషీద్, సంజీవ నాయుడు, గుల్జార్బి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, రహంతుల్లా పాల్గొన్నారు.

→ **డోన్ టౌన్:** ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రంపై ఉద్యమించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయిలకొండ నాగరాజు, సీఐటీయూ మండల అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు షమీమ్ బేగం, శ్రీనివాసులు, నాగన్న, హరి, ఇర్ఫానాబేగం, అమృత, మాదేవి, షాబానా, వరలక్ష్మి ఉన్నారు.

→ **కోవెలకుంట్ల:** నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్ విజ్ఞప్తి చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పుష్పకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు త్యాగరాజు, నరసింహుడు, రాములమ్మ, అచ్చమ్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సేవలపై శిక్షణ

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని మిట్టపల్లి, తమ్మడపల్లె, యనకండ్ల గ్రామ సచివాయాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలపై సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా శిక్షణ ఇచ్చారు. భూముల కొనుగోలుదారులు, అమ్మకందారుల వద్ద నుంచి తీసుకోవాల్సిన డాక్యుమెంట్లు, పరిశీలన, ఆన్‌లైన్ విధానం తదితర అంశాలను కంప్యూటర్ ద్వారా వివరించారు. ఈనెల 9 వరకు కొనసాగనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శ్రీధర్ గుప్తా సూచించారు.



రిజిస్ట్రేషన్ సేవలపై శిక్షణ ఇస్తున్న సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్: కర్నూలులోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని రామ్ స్కూల్ ఆఫ్ కరాటే మాస్టర్ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 8 కటా, కుమితి విభాగాల్లో దేవాన్ష్ బంగారం, లౌక్య రజత పతకాలు సాధించారన్నారు. అండర్-10 కటా, కుమితి విభాగాల్లో నిఖిల్ రజతం, సాయి దీరజ్, అభిరాం కాంస్య పతకాలు, అండర్ 11 విభాగంలో చరణ్ బంగారు, రంగనాథ్ రజత, అండర్ -12 విభాగంలో సాయిచరణ్ రజతం, చరణ్ కాంస్యం, మోక్షిత్ రజత పతకాలు సాధించారన్నారు.

మహానందిని వదలని ఎలుగుబంటి

మహానంది: మహానందిలో గత మూడురోజులుగా సంచరిస్తున్న ఎలుగుబంటి సోమవారం తెల్లవారుజామున మళ్లీ టోల్‌గేట్ ఎదురుగా ఉన్న పొలాల్లో కనిపించింది. వేకువన రెండు గంటల సమయంలో టోల్‌గేట్ పరిసరాల నుంచి పెట్రోల్‌బంక్ వెనుక వైపు మార్గం ద్వారా తెలుగుగంగ కట్టవైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మహానందీశ్వరస్వామి దర్శనం వేకువ నుంచే ప్రారంభమవుతుంది. దీంతో ఆలయ సిబ్బంది, అర్చకులు తెల్లవారుజామున 3.30గంటల నుంచే వెళ్లాల్సి ఉంది. అయితే ఎలుగుబంటి సంచారంతో భయంభయంతో విధులకు వెళ్తున్నారు. ఇందిలా ఉండగా ఎలుగు బంటి సంచారంపై పత్రికల్లో, టీవీల్లో నిత్యం వార్తలు రావడంతో అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. డిప్యూటీ రేంజర్ నాగేంద్ర నాయక్, డీఆర్వో హైమావతి, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ప్రొటెక్షన్ వాచర్లు కాలనీల్లో ఎగులు బంటి ఆచూకీ కోసం అన్వేశించగా.. తెలుగు గంగ క్వాటర్స్ వద్ద ఓ పాత ఇంటి వద్ద ఎగులుబంటి కంటబడింది. దానిని పట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎగులుబంటిని బంధించి అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు వారు వెల్లడించారు.



పాత ఇంటి వద్ద ఉన్న ఎగులుబంటి

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మద్యానికి బానిసైన ఓ యువకుడు అలవాటు మానుకోలేక మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కర్ణమయ్య వీధికి చెందిన వెంకటేశ్వర్‌గౌడ్ (22) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ సభ్యులు ఎంత నచ్చచెప్పినా మానకపోవడంతో కుటుంబంలో తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సోమవారం పూటుగా మద్యం సేవించిన వెంకటేశ్వర్‌గౌడ్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సరికే విగతజీవిగా వేలాడుతుండటంతో కిందకు దించారు. మృతుడి తల్లి నీలావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ తీగలు తెగి కింద పడి ఉంటే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. తోటలు, పొలాలు, ఇతర ప్రదేశాల్లో విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగిపడి ఉంటే వాటిని తాకవద్దన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే ప్రదేశంలో విద్యుత్ తీగలు ఉన్నట్లయితే జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

మద్దిలేటి స్వామికి కంఠాభరణం బహూకరణ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే కాలనీకి చెందిన రామసుబ్బరావు దంపతులు రూ.లక్ష విలువచేసే వెండి కంఠాభరణం విరాళమిచ్చారు. ఆభరణాన్ని ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడుకు సోమవారం అందజేశారు. దాతలను స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గస్థాయి సమావేశం

డోన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ అధికారి షంషాద్‌బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదర్శం ఉమేష్ చంద్ర

డోన్ టౌన్: ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి ఆదర్శప్రాయుడు ఐపీఎస్ ఉమేష్‌చంద్ర అని సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉమేష్ చంద్ర వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఐలు భాస్కర్, గోపాల్, శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ, తదితరులు ఉన్నారు.



ఉమేష్‌చంద్ర చిత్ర పటానికి నివాళ్లర్పిస్తున్న దృశ్యం

ఇళ్ల స్థలాల పేరుతో మభ్యపెట్టొద్దు

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్: ప్రతి ఒక్కరికి సెంటున్నర ఇంటి స్థలం ఇస్తానంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ప్రజలను మభ్యపెట్టడం తగదని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు హితవు పలికారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. దాన ధర్మాలు, పుణ్యకార్యాలు చేసిన బుగ్గన కుటుంబంపై సుబ్బారెడ్డి బురద చల్లాలనుకోవడం సూర్యునిపై ఉమ్మి వేయడమేనన్నారు. అవినీతి, అక్రమ వ్యాపారాలు చేసి కోట్ల రూపాయలను ఆర్జించిన సుబ్బారెడ్డికి నిజాయతీకి మారుపేరైన మంత్రి బుగ్గనను విమర్శించే స్థాయి లేదన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో డోన్‌లో జరిగిన అభివృద్ధిని వార్డు మెంబర్‌గా గెలవలేని సుబ్బారెడ్డి తానే చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పథకం ప్రకారం కోట్ల, కేఈ కుటుంబాల అభిమానులను రాజకీయంగా అనగదొక్కి తప్పుడు కేసులు బనాయించిందెవరో ప్రజలకు తెలుసన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నీచ చరిత్ర సుబ్బారెడ్డిదేనని కోట్ల, కేఈ వర్గీలు బహిరంగంగా చెబుతున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇంటింటికి తిరిగి సెంటున్నర స్థలం ఇస్తాని పేర్లు నమోదు చేసుకొని మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే పక్కా సర్వే నంబర్లతో ఎక్కడ పేదలకు ప్లాట్లు పంపిణీ చేస్తావో బహిరంగంగా ప్రకటించాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు

ఆరోపణలు అర్థరహిత

జగనన్న కాలనీల కోసం ప్రభుత్వ భూ సేకరణలో అవినీతి జరిగిందని సుబ్బారెడ్డి చేసిన చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని దొరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తెలిపారు. తన భర్త రంగరత్నంకు భూ నష్టపరిహారం డబ్బు ఇవ్వకపోవడంతో టీడీపీ నాయకులకు తొత్తుగా మారి అనవసరంగా వైఎస్సార్ సీపీ నాయకులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆమె తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెంపల్లి రామచంద్రుడు, న్యాయవాది భాస్కర్‌నాయుడు, దినేష్‌గౌడ్, ఆర్ఈ రాజవర్దన్, నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్ ఆర్టీ రమణ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

డోన్: ద్విచక్రవాహన దారుడు సోమవారం అభివృద్ధి పనుల నిమిత్తం తీసిన గోతిలో పడ్డాడు. అదృష్టవశాత్తూ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు బాధితుడు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఉలింగమ్మ గుడి వద్ద రోడ్డు విస్తరణ, తాగునీటి పైపు లైన్‌ల ఏర్పాటు పనుల్లో భాగంగా మునిసిపల్ సిబ్బంది రోడ్డుకు ఒకవైపు గోతి తీశారు. వర్షం కారణంగా పనులు నిలిపేశారు. ఈక్రమంలో సోమవారం ద్విచక్రవాహనదారుడు గోతిలో పడటంతో స్థానికులు స్పందించి కాపాడారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ అక్కడికి చేరుకుని గోతిలోని నీటిని మోటార్ల ద్వారా తొలగించి, పైపులైన్ మరమ్మతు పనులను చేయించారు. చైర్మన్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, డీఈ రసూల్, ఏఈ సురేష్ ఉన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్

మహానందీశ్వరుడి పల్లకీసేవ రద్దు

మహానంది: శ్రావణమాసం, మూడవ సోమవారం జరగాల్సిన మహానందీశ్వరుడి పల్లకీసేవ వర్షం కారణంగా రద్దైంది. కాగా, శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు అలంకార పూజ, హారతులు చేపట్టి రాత్రి ఏకాంతసేవ పూజలు చేశారు.

చర్మ ముద్ద వ్యాధి నివారణకు చర్యలు

- పశువులకు విస్తృతంగా ముందస్తు టీకాలు
- నియోజకవర్గంలో 86,440 పశుసంపద
- ఇప్పటికే 4,080 పశువులకు టీకా పూర్తి

బనగానపల్లె: పాడిపశువులకు ప్రాణాంతకమైన లంపీ స్కిన్(చర్మ ముద్ద) వ్యాధికి ప్రభుత్వం ముకుతాడు వేస్తోంది. ముందస్తు టీకాలు వేసి పాడి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు పశువైద్యాధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించి పశువులకు టీకా వేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 86,440 పశుసంపద ఉండగా ఇప్పటికే దాదాపు 4,080 పశువులకు టీకాలు వేశారు.

ఆఫ్రిక ఖండం నుంచి..

లంపీ స్కిన్ వ్యాధిని తొలిసారిగా 1992లో ఆఫ్రిక ఖండంలోని జాంబియాలో గుర్తించినట్లు పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. 2019లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోను లంపీ స్కిన్ కేసులు నమోదయ్యాయి. 2022లో జిల్లాలో ఈ వ్యాధికి గురై కొన్ని పశువులు మృత్యువాత పడ్డాయి. ఆవులు, దూడలు, ఎద్దులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతోంది. ఈ వ్యాధి సోకిన పశువులకు చర్మంపై బుడిపెలు, దద్దుర్లు ఏర్పాడతాయి. ఇది అంటు వ్యాధి కావడంతో మిగతా పాడిపశువులకూ వ్యాపిస్తుంది. పది రోజుల్లోపు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. 105 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది. చర్మం ముద్దగా మారుతుంది. మేత, నీరు తీసుకోవడం నిలిపివేస్తాయి. కళ్లు, ముక్కు నుంచి నీరు కారుతాయి. ముట్టిమీద, నోటిదూలం లోపల బుడిపెలు వస్తాయి. మెడ, తొడ వద్ద లింపు గ్రంథులు వస్తాయి. పశువుల చర్మంపై బుడిపెలు ఏర్పడి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే పశువులు మేత మేయక పాలు పూర్తిగా తగ్గిపోతాయి. చర్మంతో పాటు పొదుగు బాహ్య జననేంద్రియాలపై దద్దుర్లు కనిపిస్తాయి. నొప్పి అధికంగా ఉండి పాలు పితకనీయవు. సకాలంలో పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధిసోకిన పశువుల్లో 1–5 శాతం వరకు మృత్యువాత పడే అవకాశం ఉంది. ఒక గ్రామంలో అన్ని పశువులకు వైరస్ సోకితే ప్రమాదస్థాయి పెరుగుతుదని పశుసంవర్ధకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో పాడిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. లక్షలాది మంది పాడినే ఆధారంగా చేసుకొని జీవిస్తున్నారు. నాలుగు నెలలు ఆపై వయసు ఉన్న దూడల్లో ఈ వ్యాధిలక్షణాలు ఎక్కువగా అగుపించనప్పటికీ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నారు.



పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్న పశువైద్యులు

నియోజకవర్గంలో పశు సంపద టీకాల కార్యక్రమం వివరాలు

మండలం	పశుసంపద	వేసిన టీకాలు
బనగానపల్లె	1,537	1874
అవుకు	19,505	886
కోవెలకుంట్ల	9,335	402
కొలిమిగుండ్ల	11,744	339
సంజామల	14,319	579

ముందస్తు టీకాలు

లంపీ స్కిన్ వ్యాధి పశువులకు ప్రమాదకరమైంది. అందువల్ల వ్యాధి నివారణకు ముందస్తూ టీకాల కార్యక్రమం చేపడుతున్నాం. చిన్న దూడలకు కూడా టీకాలు వేస్తున్నాం. ఈ వ్యాధి సోకిన్నట్లు అనుమానం రాగానే వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలి.

– డాక్టర్ మారతిసకారామ్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, బనగానపల్లె